# మీరా సంగీత మండలి ఆధ్వర్యంలో అద్భుతమైన

# సంగీత, నృత్య కార్యక్రమం



- సంగీత, నృత్యాలతో అలరించిన "కిషన్ రావు పురస్కార" వేడుక

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి. సైదులు),జూన్9:** మీరా సంగీత మండలి ఆధ్వర్యంలో సోమవారం అద్భుతమైన సంగీత,నృత్య కార్యక్రమంతో పాటు, ప్రముఖ రచయిత, సంగీతజ్ఞులు ఇందారం కిషన్ రావు పేరిట పురస్కార ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. మీరా మండలి అధ్యక్షులు పింగళి వెంకటేశ్వర రావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన ఈ కార్యక్రమం కళాభిమానులను ఎంతగానో ఆకట్టుకుంది.

**సంగీత విభావరితో ప్రారంభం:**

ఈ కార్యక్రమం ప్రారంభంలో ఉమ్మడి లక్ష్మణాచారి మహాగణపతి కీర్తనతో తమ సంగీత కచేరీని ప్రారంభించి శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. అనంతరం పుసిపట్ల సురేష్ వాయిద్య ప్రదర్శన అందరినీ అలరించింది.ఆయనకు తబలాపై శ్రీ ప్రకాష్ జి.డి. చక్కటి సహకారం అందించారు.

**శాస్త్రీయ సంగీతంలో సుష్మిత బృందం మెరుపులు:**



ఇందారం సుష్మిత వారి బృందం అందించిన శాస్త్రీయ సంగీత కార్యక్రమం ఆహుతులను ఎంతగానో అలరించింది.ఈ బృందానికి మృదంగంపై కీర్తి లక్ష్మణ్, వైలన్‌పై చిన్ని కృష్ణ, ఘటంపై ఇందారం నాగేశ్వరరావు, గాత్రంపై చిరంజీవులు ఇందారం శ్రీప్రియ,ఇందారం శ్రీచరిత తమ సహకారాన్ని అందించారు.

**కూచిపూడి నాట్య ప్రదర్శనతో ఆకట్టుకున్న అణిశ్రిత, హిమాన్సి**

అణిశ్రిత రెడ్డి కుందూరు టెంపుల్ డాన్స్ స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, హిమాన్సి కాట్రగడ్డల కూచిపూడి నాట్య ప్రదర్శన కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వారి నాట్య విన్యాసాలు ఆహ్వానితులను ఎంతగానో ఆకర్షించాయి.

**మధుర గీతాలాపనతో మైమరపించిన గాయకులు**

శ్రీ ఇందారం కిషన్ రావు రచించిన మధుర గీతాలాపన ఈ కార్యక్రమానికి ప్రత్యేక శోభను తెచ్చింది.నరహరి వాణి సతీష్ కుమార్,గుమ్మడిజనార్దన్‌ల గాత్రం ఆహ్వానితులను ముగ్ధులను చేసింది.

**"ఇందారం కిషన్ రావు పురస్కారం" ప్రదానం**

ఈ కార్యక్రమ చివరి భాగంలో ప్రముఖ పండిట్ గుమ్మడి జనార్దన్ కి ముఖ్య అతిథి చేతుల మీదుగా "శ్రీ ఇందారం కిషన్ రావు పురస్కారం" ప్రదానం చేయబడింది.ఈ వేడుకలో శ్రీ దాస్యం విజయ్ భాస్కర్ కూడా పాల్గొన్నారు.

**కిషన్ రావు పై ప్రశంసలు**

ఈ సందర్భంగా శ్రీ గిరిజా మనోహర్ బాబు మాట్లాడుతూ...కిషన్ రావు తో తమ సాన్నిహిత్యాన్ని గుర్తుచేసుకుంటూ, వారి సమయస్ఫూర్తిని, అద్భుత రచనలను కొనియాడారు.శ్రీ వనం లక్ష్మీకాంత్ రావు మాట్లాడుతూ....కిషన్ రావు కి జానపదంపై ఉన్న ఆసక్తిని గుర్తు చేస్తూ, వారిపై ఉన్న ప్రేమ అభిమానాన్ని వ్యక్తం చేసే అవకాశం మీరా మండలి ద్వారా లభించినందుకు సంతోషం వ్యక్తం చేశారు.

**మీరా మండలి అధ్యక్షుల కృతజ్ఞతలు: మీరా మండలి అధ్యక్షులు పింగళి వెంకటేశ్వర రావు**

మాట్లాడుతూ....ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడానికి ప్రధానంగా వనం లక్ష్మీకాంత్ రావు కి,గిరిజా మనోహర్ రావు కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, కార్యవర్గ సభ్యుల సహాయ సహకారాలకు అభినందనలు తెలియజేశారు.




# నూతన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు

# శుభాకాంక్షలు వెల్లువ



- అడ్లూరినీ మర్యాద పూర్వకంగా కలిసిన ప్రముకులు
- ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం
- మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షులు పత్తి కుమార్

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి. సైదులు),జూన్9:** తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో భాగంగా నూతన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం,మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షులు పత్తి కుమార్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.నాగరిగారి ప్రీతం,పత్తి కుమార్ లు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వారి నివాసం నందు మర్యాదపూర్వకంగా కలిశారు.నూతన మంత్రిగా బాధ్యతలు చేపట్టిన లక్ష్మణ్ కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...రాష్ట్ర అభివృద్ధికి, ముఖ్యంగా బలహీన వర్గాల సంక్షేమానికి ఆయన విశేష కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మంత్రివర్గంలో ఆయనకు స్థానం లభించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ఆయన పదవీ కాలం విజయవంతం కావాలని ఆకాంక్షించారు.